సాక్షి శ్రీకాకుళం

గురువారం । 16 । జనవరి । 2025



వైభవంగా కర్పూరజ్యోతి దర్శనాలు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో కర్పూర జ్యోతిని వెలిగించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

- 8లో



కన్నీటి వీడ్కోలు

రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖరం అంతిమ వీడ్కోలు బుధవారం పాలకొండలో నిర్వహించారు. అశేషంగా జనం తరలివచ్చారు.

- 8లో

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు గురువారం నుంచి పునఃప్రారంభంకానున్నాయి. గత నెల 30 నుంచి సెలవు రోజుల్లో మినహా ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో ఈవెంట్స్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. సంక్రాంతి నేపథ్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు విరామమిచ్చారు. ఈ నెల 18వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. షెడ్యూల్ మేరకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది.

న్యూస్‌రీల్

నవోదయ పరీక్షకు 32 కేంద్రాలు

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18న నిర్వహించనున్న ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8290 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడంతో 32 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు 32 మంది సూపరింటెండెంట్లు, 17 మంది సీఎ ల్‌ఓలు, 15 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు వివరించారు.

ఆదిత్యునికి అభిషేక సేవ



పూజలు చేస్తున్న శంకరశర్మ బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకం చేశారు. గర్భాలయంలోని స్వామి మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించడంతో పాటు నిజరూప దర్శనం కలగడంతో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఉషా పద్మిని ఛాయా దేవేరులతో ఆదిత్యుని ఉత్సవమూర్తులతో తిరువీధి నిర్వహించారు. అనంతరం అనివెట్టి మండపంలో వెండి సప్తాశ్వ రథంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపథంలో భాగంగా ఆలయ ఆస్థాన నాదస్వర బృందంతో సంగీత కచేరి నిర్వహించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ప్రసాదాల నివేదన చేపట్టారు.

నంది వాహనంపై నాగాభరణుడు



తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు: కనుమ పండగ సందర్భంగా ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుడిని బుధవారం రాత్రి నంది వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వరులను అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు పెద్ద ఎత్తున హారతులిచ్చారు. సాధారణంగా స్వామివారి తిరువీధిని ఆలయ మాడవీధులకు పరిమితం చేస్తుంటారు. కానీ కనుమ నాడు మాత్రం నగిరికటకం వరకూ పార్వతీ పరమేశ్వరుల తిరువీధిని నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్దానంలో నేస్తరికం సందడి



నేస్తం ఇంట్లో భోజనం చేస్తున్న సన్యాసిరావు దంపతులు

కాశీబుగ్గ: ఉద్దానం మారుమూల గ్రామాల్లో నేస్తరికం సందడి నెలకొంది. గిరిజనులు కనుమనాడు మిత్తనోరు ఇళ్లకు వెళ్లి భోజనం చేశాక తాము పండించిన పంటలను అందిస్తున్నారు. తిరిగి వచ్చేటప్పుడు వారు అందించే వస్త్రాలను స్వీకరిస్తున్నారు. బుధవారం మందస మండలం సందూరు గ్రామంలో దాసరి వాసుదేవరావు ఇరవై ఏళ్ల క్రితం మరణించినా.. వారి నేస్తం సవర సన్యాసిరావు సంతలక్ష్మీపురం నుంచి భార్యతో కలిసి వచ్చి ఆతిథ్యం స్వీకరించారు.

కనుమ నాడు భోగి మంట



మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో బుధవారం కనుమ పండగ నాడు భోగి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడ చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నందున భోగి రోజు వరకు నేత వస్త్రాలు పనిలో బిజీగా ఉంటారు. అందుకే ఆ రోజు భోగి మంట వేయరు. సంక్రాంతి పండగ మరునాడు భోగి మంట వెలిగించడం సంప్రదాయంగా వస్తోందని గ్రామానికి చెందిన బొచ్చు మోహనరావు, బొమ్మన వీరబద్రరావు, సురేష్ కుమార్ తెలిపారు.

సప్త సముద్రాల ఆవల ▸ సంక్రాంతి ఇలా..

- తెలుగు సంప్రదాయాలను కొనసాగిస్తున్న ప్రవాసాంధ్రులు
- ఘనంగా పెద్ద పండగ జరుపుకున్న సిక్కోలు ఎన్ఆర్ఐలు

వారంతా ఉద్యోగ, వ్యాపారాల రీత్యా దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. అయితేనేం మూలాలకు మాత్రం కట్టుబడి ఉంటున్నారు. తెలుగు సంస్కృతిని కొనసాగిస్తూ ప్రతి పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో ఎప్పట్లాగే ఈ సంవత్సరం కూడా తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతిని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. భోగినాడు నలుగు పిండితో స్నానం, భోగి మంటలు, చిన్నారులకు భోగి పండ్లు పోయడం, సంక్రాంతి నాడు పెద్దల పూజ, అరిసెలు, ఇతర పిండివంటలు చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఎన్ఆర్ఐలుగా దేశవిదేశాల్లో స్థిరపడిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు ప్రవాసాంధ్రులు తాము సంక్రాంతి పండుగను ఎలా జరుపుకున్నామో 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

-శ్రీకాకుళం కల్చరల్ /ఎచ్చెర్ల క్యాంపస్



కెన్యాలో అపార్టుమెంట్ వద్ద భోగి మంట

గోదా కల్యాణం చేశాం..



భారత్‌లో ఎలా ఉన్నామో ఇక్కడ అదే మాదిరిగా సంప్రదాయాలను పాటిస్తుంటాం. 40 ఏళ్లుగా న్యూజెర్సీలో నివాసముంటున్నాను. మన పిల్లలకు మూలాలను తెలియజేయాలనే ఉద్దేశంతో భోగి, సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకున్నాం. ఈ ఏడాది సుమారు 3 వేల మంది ఉత్సవాల్లో పాల్గొన్నారు. భోగి మంటతో పాటు శివవిష్ణు ఆలయంలో సామూహికంగా గోదా కల్యాణం నిర్వహించాం. ఇదే ఆలయానికి బోర్డు డైరెక్టర్‌గా కొనసాగుతున్నాను.

– గేదెల దాము, అమెరికా, స్వగ్రామం కత్తులకవిటి



అమెరికాలో గోదా కల్యాణం

జోష్‌ఫుల్‌గా..

భారత్‌లో మాదిరిగానే ఇక్కడ చూడా మూడు రోజుల పాటు పండగ సందడే. గేమ్స్, ఎగ్జిబిషన్, అన్నిరకాల ఫుడ్ ఐటమ్స్ ఏర్పాటు చేశారు. తెలుగు సంస్కృతిని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. భారత్ నుంచి కళాకారులను పిలిపించి ప్రదర్శనలు ఇప్పిస్తున్నాం. పండగ నాడు కాకుండా ప్రత్యేకంగా ఒక రోజు నిర్ణయించి



ఇక్కడి తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మరోసారి సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తారు. ఎందుకంటే కొందరు పండగ కోసం స్వగ్రామాలకు వెళ్లిపోయారు. వారు తిరిగొచ్చాక మళ్లీ వేడుకలు నిర్వహిస్తాం.

– రవి, కెన్యా స్వగ్రామం మద్దువలస, వంగర మండలం

ప్రత్యేక విలేజ్ సెట్టింగ్ వేస్తాం..



పాతికేళ్లుగా సింగపూర్‌లో ఉంటున్నాం. ఇక్కడ లిటిల్ ఇండియా అనే ప్రదేశముంది. పండగ సమయంలో పెద్ద ఎత్తున షాపింగ్ జరగడంతో మార్కెట్ రద్దీగా ఉంటుంది. భావితరాలకు సంక్రాంతి ప్రాముఖ్యతను తెలియచేయడానికి భారత్ తరహాలో ఇక్కడ కూడా ఒక గ్రామం సిద్ధం చేస్తారు. పాడి పంటలు, పండగ ప్రాముఖ్యతను తెలియజేసే ప్రత్యేక సెట్లు ఏర్పాటు చేస్తారు. తెలుగు సమాజం ఆధ్వర్యంలో అతిథులతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఆడపిల్లలతో ముగ్గులు వేయించడం, పిండివంటలు చేయిస్తారు. కొత్త దుస్తులు ధరించి పెరుమాళ్ ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకొని ఇళ్లకు వెళతాం.

– తంగుడు మృత్యుంజయరావు, సింగపూర్, స్వగ్రామం నరసన్నపేట

అన్నీ ఇళ్లలోనే..

సింగపూర్‌లో తెలుగువారు ఎక్కువ. ప్రతిపండగను ఎవరి ఇంటిలో వారు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. భారతీయులందరి కోసం ఇక్కడ పెద్ద ఊరే ఉంది. పండగలకు చెందిన అన్ని వస్తువులు ఒకే చోట దొరుకుతాయి. తెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను భారీ ఎత్తున నిర్వహిస్తారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను వివరించేలా ప్రదర్శనలు ఇస్తారు.

– పైడిశెట్టి ప్రభాకరరావు, సింగపూర్, స్వగ్రామం శ్రీకాకుళం



ప్రభాకరరావు ఇంట్లో భోగి పండ్లు సంబరం

ఇంటిలోనే భోగిమంట..





మాపెద్దలు చెప్పినవి చెప్పినట్లు ఆచరిస్తాం. భోగినాడు భోగి మంటను బహిరంగంగా కాకుండా ఇంటిలోనే ఫైర్ ప్లేస్ ఏర్పాటు చేశాం. కొద్దిసేపు మాత్రమే వెలిగించాం. ఉదయం పిల్లలకు తల స్నానం చేయించి దేవుడి చిత్రపటం వద్ద శ్లోకాలు చదివించాం. సాయంత్రం భోగిపండ్లు పోశాం.

– స్వాతి జగదీష్ గరిమెళ్ల, అమెరికా, స్వగ్రామం శ్రీకాకుళం

సందడిగా సంక్రాంతి



తెలుగు రాష్ట్రాల తరహాలోనే అమెరికాలోనూ సంక్రాంతి పండగను సందడిగా జరపుకుంటాం. గతంలో సంక్రాంతికి స్వగ్రామానికి వెళ్లావాళ్లం. ప్రస్తుతం కుదరకపోవడంతో స్థానికంగా ఉన్న తెలుగు వారితో కలిసి సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుక నిర్వహిస్తున్నాం. ఈసారి కూడా పిండి వంటలు, సంప్రదాయ వస్త్రాలు ధరించి సందడిగా జరుపుకున్నాం.

– బల్లాడ రవికుమార్ దంపతులు, అమెరికా,(స్వస్థలం కుప్పిలి)

సిక్కోలు వంటకాలు.. ▸ తిన్నాం మైమరుచి



చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ముంబై తదితర నగరాల్లో సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడి బిజీ లైఫ్ కారణంగా అప్పటికప్పుడు దొరికే జంక్‌ఫుడ్‌తో సరిపెట్టుకున్న వారంతా సంక్రాంతి పుణ్యమా అని సొంత గ్రామాలకు వచ్చి ఇక్కడి సిక్కోలు రుచులను ఆస్వాదిస్తున్నారు. జంతికలు, అరిసెలు, పులిహోర, బొబ్బట్లు, బూరెలు, గారెలు, కుడుములు, అప్పాలు తదితర పిండివంటలు, నాటుకోడి కూర వంటి మాంసాహార రుచులతో మైమరిచిపోతున్నారు. మహానగరాల్లో పని ఒత్తిడి కారణంగా ఇంట్లో కనీసం వంటలు చేసుకునే తీరిక లేకుండాపోయిందని, ఇప్పుడు ఇంటి వంట తినడం ఆనందంగా ఉందని చెబుతున్నారు

– టెక్కలి/ శ్రీకాకుళం కల్చరల్/సారవకోట

ఆన్‌లైన్ ఆహారంతో విసిగిపోయాం..



నిన్నటి వరకు బ్యాచిలర్ రూమ్‌లో ఆన్‌లైన్ ఆర్డర్ వంటకాలతోనే సరిపెట్టుకున్నాం. సంక్రాంతికి ఇంటికి రాగానే ఇక్కడ సంప్రదాయ వంటకాలతో ఒక్కసారిగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. సంక్రాంతి, కనుమ రోజుల్లో సొంత గ్రామాల్లో ఇళ్లల్లో చేసుకునే మన వంటకాలకు ఇతర ఏ ఆహార పదార్థాలు సాటి రావు.

– డి.యశ్వంత్, టెక్కలి (చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి)

చేగోడీలు ఇష్టం..



చెన్నైలో స్థిరపడ్డాం. సంక్రాంతి సందర్భంగా పుట్టింటికి చెన్నైనుంచి వచ్చాను. మా ఇంట్లో ఎన్నో రకాల పిండి వంటలు చేశారు. అందులో కరకరలాడే చేగోడీలను మా పిల్లలు చాలా ఇష్టంగా తిన్నారు. సంప్రదాయ వంటకాల్లోనే పోషక విలువలు ఎక్కువ.

– సందీప్ రుక్మిణి, చెన్నై(స్వస్థలం శ్రీకాకుళం)

భలేభలే బొబ్బట్లు



ప్రతి ఏడాది మేము ఇక్కడికి వస్తాం. మా అమ్మ చేసే పిండి వంటలు ఎంతో రుచిగా ఉంటాయి. వాటిని ఇష్టంగా తింటాం. అందులోనూ బొబ్బట్లు అంటే ఇంకా ఇష్టం. సంక్రాంతి ముగిశాక తిరిగి వెళ్లినపుడు మా వెంట పిండివంటలు తీసుకెళ్తాం. ఈ రుచులను మరికొంత కాలం ఆస్వాదిస్తాం.

– పిండి మధుసూదనరావు, ప్రశాంతి, హైదరాబాద్

చాలా ఇష్టం..



మాది పెద్దలంబ. కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాం. సారవకోట చుప్పులకు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరుంది. సొంతూరు వచ్చిన ప్రతిసారీ సారవకోట చుప్పులు కొని తీసుకెళ్తాం. వీటిని పెద్దలతో పాటు పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. పండగకి వచ్చిప్పుడు మా చెల్లెలు, తమ్ముడు వాళ్ళు వీటిని కొని తీసుకెళ్తారు.

– కొండాల బాలకృష్ణ, హైదరాబాద్

సారవకోట చుప్పల రుచే వేరు..



మా సొంత ఊరు చిన్నసాన. మేము విశాఖపట్నంలో ఉంటున్నాం. పెద్దమ్మ వాళ్లింటికి సంక్రాంతి సందర్భంగా వచ్చాం. ఎప్పుడు వచ్చినా ఇక్కడి నుంచి చుప్పులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటాం. అక్కడ మా చుట్టు పక్కల వారికిస్తే ఇష్టంగా తింటుంటారు.

– సిగిరివలస నరసింహ, విశాఖపట్నం



సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద పోటెత్తిన జనం

జన జాతర

సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించిన జాతరలకు జనం పోటెత్తారు. ఆమదాలవలసలోని సంగమేశ్వరుడు, శ్రీముఖలింగం సమీపంలో మహావిష్ణువు, పెదపాడులోని అప్పన్నమ్మ, గెద్దకంచరాంలోని పైడి తల్లిఅమ్మవారు.. ఇలా తమ ఆరాధ్య దైవాలను దర్శించుకుని భక్తులు తన్మయత్వం చెందారు. అంతా మంచే జరగాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- కిటకిటలాడిన దైవ క్షేత్రాలు
- భారీగా పోటెత్తిన భక్తులు

సంగమేశ్వరుని సన్నిధిలో..

మండలంలోని గాజులకొల్లివలసలో సంగమేశ్వరస్వామి ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రా స్థలంలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్స్, ఇతర ఆటల పరికరాలతో చిన్నారులు సందడి చేశారు.

– ఆమదాలవలస

మహిమాన్వితం మహావిష్ణువు జాతర

ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం క్షేత్ర పాలకుడు శ్రీమహావిష్ణువు జాతర కనులపండువగా జరిగింది. శ్రీముఖలింగం – కరకవలస గ్రామాల మధ్య పద్మనాభ కొండపై జరిగిన ఈ యాత్రకు స్థానిక గ్రామాలతో పాటు హిరమండలం, జలుమూరు, ఎల్ఎన్‌పేట నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలి వచ్చారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు అనంతరం భక్తులతో దర్శనాలు చేయించారు. కరకవలస యువత సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

-జలుమూరు



జాతరకు హాజరైన జనం (ఇన్‌సెట్లో)పూజలు

కోర్కెలు తీర్చే కల్పవల్లి.. పైడితల్లి

మండలంలోని గెద్దకంచరాంలో పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ వై.మధుసూదనరావు బందోబస్తు చేపట్టారు.

-జి.సిగడాం



పైడితల్లి అమ్మవారు

కరుణించమ్మా అప్పన్నమ్మా..

పెదపాడులోని అప్పన్నమ్మతల్లి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కనుమ పండుగ సందర్భంగా ముఠ్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి నుంచే భక్తులు బారులు తీరారు. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

-శ్రీకాకుళం రూరల్



పెదపాడులో కొలువైన అప్పన్నమ్మతల్లి

కొండంత జనం..

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం(సరియాపల్లి పంచాయతీ)లోని సీతకొండ యాత్రకు జనం పోటెత్తారు. ఏకశిలగా ఉన్న ఈ కొండపైకి సంక్రాంతి, కనుమ సందర్భంగా భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర రాత్రి ఎనిమిది గంటల వరకు కొనసాగింది.

-కాశీబుగ్గ



క్లుప్తంగా

పలువురిపై కేసు నమోదు

ఎల్.ఎన్.పేట: సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, శాంతి భద్రతలకు నష్టం కలిగించిన పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎల్.ఎన్.పేట మండలం తురకపేట సెంటర్‌లో అక్రమంగా బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై బి.హైమావతి తెలిపారు. కరకవలస, శ్యామలాపురం ఆర్‌ఆర్ కాలనీ, పెద్దకోట, డొంకలబడవంజ, సరుబుజ్జిలి మండలం కొత్తకోట గ్రామాల్లో పిక్కాట, పేకాట ఆడుతున్న 17 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

- పాతపట్నం: మేజర్ పంచాయతీ పరిధిలోని కోటగుడి కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని, చంగుడి గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.30,300, రూ.9,030 చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.
- పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురంలో బుధవారం ఓ మహిళ వద్ద 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ సింహాచలం తెలిపారు.
- సోంపేట: మండలంలోని రుషికుడ్డ గ్రామంలో ఒక వ్యక్తి వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లు, జింకిభద్రలో 6 మద్యం బాటిళ్లతో మరొక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లవరాజు తెలిపారు.
- పాతపట్నం: మండలంలోని సింగుపురం, గంగువాడ గ్రామాల్లో డొక్కుఅట్ట పిక్కాడ ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.5,070, రూ.2,350, రూ.5,800 చొప్పున నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని చెప్పారు.

ఉద్దానం యువ కవి ప్రతిభ

పలాస: మండలంలోని మాకన్నపల్లి గ్రామానికి చెందిన యువ కవి కుత్తుం వినోద్ తన కవితల ద్వారా ప్రజలు మన్ననలు పొందుతున్నాడు. అమెరికాలోని అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా)ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న 'అమెరికా భారతి' జనవరి సంచికలో 'ఒక తుఫాను రాత్రి' అనే శీర్షికతో తన కవిత ప్రచురితమైందని వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలియజేశారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన చక్రవర్తి

కొత్తూరు: కొత్తూరు కాలేజీ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తూరు చెందిన సిల్లా చక్రవర్తి పారాపురం వెళ్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే క్షతగాత్రుడికి సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చక్రవర్తి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు.

కోడిరామ్మూర్తికి ఘనంగా నివాళి



కోడిరామ్మూర్తి విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధిహీన్

శ్రీకాకుళం న్యూకాలనీ: కలియుగ భీముడిగా కితాబు అందుకున్న కోడి రామ్మూర్తినాయుడు(కేఆర్‌ఎస్) వర్ధంతిని బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని కోడి రామ్మూర్తి విగ్రహానికి డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్‌లు గాలి అర్జున్‌రావురెడ్డి, ఇప్పిలి అప్పన్న, కై లాష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీలంక తెలుగు బౌద్ధ భిక్షువు బోధిహీన్ హాజరై కోడి రామ్మూర్తి నాయుడు విగ్రహానికి నివాళ్లర్పించారు. ఇండియన్ హెర్క్యులస్‌గా పేరొందిన కోడిరామ్మూర్తి శ్రీకాకుళం జిల్లా వాసి కావడం సిక్కోలుకు గర్వకారణమన్నారు. తెలుగురువారే కాకుండా యావత్ భారతదేశం గర్వించదగ్గ మల్లయోధుడు కోడిరామ్మూర్తి అని డాక్టర్ గుండబాల మోహన్ కొనియాడారు.

ఉత్సాహంగా కోడెబళ్ల సంబరం

పొందూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడెబళ్ల సంబరాలు ఉత్సాహంగా సాగాయి. లోలుగు, రాపాక, పొందూరు, కనిమెట్ట తదితర గ్రామాల్లో సంక్రాంతి నాడు ప్రధాన వీధుల్లో ఎడ్లను పరుగులు తీయించటం ఆనవాయితీగా వస్తోంది.



రాపాక వీధుల్లో పరుగులు తీస్తున్న ఎడ్లబండి

పండగ వేళ.. పట్టణమిలా!



మటన్ షాపు వద్ద రద్దీ



వెలవెలబోతున్న శ్రీకాకుళం వైఎస్సార్ కూడలి



సినిమా థియేటర్ వద్ద సందడి

సంక్రాంతి వరకు రద్దీగా కనిపించిన జిల్లా కేంద్రం రోడ్లు కనుమ నాడు బోసిపోయాయి. చాలామంది పల్లెలకు తరలివెళ్లడంతో ప్రధాన రహదారులు ఖాళీగా కనిపించాయి. జనాలతో నిత్యం రద్దీగా ఉండే షాపులు వెలవెలబోయాయి. చికెన్, మటన్ షాపులు మాత్రం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సినిమా థియేటర్ల వద్ద సందడి వాతావరణం నెలకొంది. - శ్రీకాకుళం కల్చరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



గాలిపటం వదులుతున్న చిన్నారులు



పాలకొండ రోడ్డులో ఇలా..

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త దాడి

- మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీ సైతం ధ్వంసం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీను చించేయడమే కాకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి పైకి కత్తులు, కర్రలతో వెళ్లి దాడికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం..దండుగోపాలపురంలో ఏర్పాటు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీని బుధవారం అదే గ్రామానికి చెందిన అనపాన అభిలాష్, కూనపు ఉపేంద్ర తదితర టీడీపీ కార్యకర్తలు చింపివేశారు. అంతటితో ఆగకుండా అభిలాష్ నేరుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిర్లాపు నరేష్ ఇంటికి వెళ్లి చేతితో కొట్టాడు. దుర్భాషలాడుతూ కత్తి, చెక్కతో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో నరేష్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై తలుపులు వేసుకున్నారు. అనంతరం బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరేష్‌తో పాటు మండల నాయకులు బసవల బాలరాజు, కోత సతీష్, మార్పు నాగభూషణ్, పొందల రామకృష్ణ, పొందల నరేంద్ర, తదితరులు కలిసి సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అభిలాష్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీను చించిన అభిలాష్, కూనపు ఉపేంద్ర తదితరులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్త బసవల బాలరాజు మరో ఫిర్యాదు చేశారు.



సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరేష్‌పై దాడికి వెళ్తున్న టీడీపీ కార్యకర్త అనపాన అభిలాష్

దాడిని ఖండించిన తిలక్, దువ్వాడ

విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బాధిత కార్యకర్తలతో మాట్లాడారు. దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఘటనపై కేసు నమోదు చేసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో జాప్యం జరిగితే సహించేది లేదన్నారు. దాడి కేసులో నిందితుడిపై చర్యలు తీసుకుకోవాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళ, బుధవారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమా చక్రవర్తి కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేయించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు జ్ఞాపిక అందజేశారు. అదే విధంగా, విలక్షణ సినీ నటుడు సాయికుమార్, జబర్దస్త్ హాస్య నటుల బృందం అప్పారావు తదితరులు కూడా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.



జస్టిస్ అనుపమకు జ్ఞాపిక అందజేస్తున్న కనకరాజు, శంకరశర్మలు



సాయికుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో భద్రాజీ

వైభవంగా కనుమ ఉత్సవం

గార: కనుమ పర్వదినం సందర్భంగా ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయం ఉపాలయమైన తండ్యాలపేటలోని అభయవరద వీరాంజనేయ స్వామి ఆలయంలో కనులపండువగా జరిగింది. బుధవారం ఉదయం నుంచి ఉత్తరముఖంగా దర్శనమిస్తున్న స్వామి మూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకూర్మనాథాలయం నుంచి స్వామిమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, లక్ష్మణ సమేత సీతారామచంద్రులను రెండు పల్లకిల్లో ఊరేగింపుగా తీసుకువచ్చారు. సుమారు 3 కిలోమీటర్లు మేర సాగిన తిరువీధిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల వద్దకు భగవంతుడనేదానికి ఈ వేడుకే నిదర్శనమని, తిరుమలలో పార్వేట ఉత్సవం మాదిరిగా దీనిని కనప ఉత్సవమని పిలుస్తుంటారని అర్చకులు తెలిపారు.



ఊరేగింపుగా వెళ్తున్న కూర్మనాథాలయం ఉత్సవమూర్తులు

కార్యక్రమంలో కూర్మనాథాలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు, తండ్యాలపేట అర్చకులు గోపినంబాళ్ల కూర్మరాజాచార్యులు, ఆలయ ఈవో జి.గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కర్పూరజ్యోతి దర్శనాలు



పాతశ్రీకాకుళంలో స్వామికి అభిషేకాలు



బలగలో అయ్యప్పస్వామికి కర్పూర హారతి ఇస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలలో మకర జ్యోతి దర్శన సమయంలో బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో కర్పూర జ్యోతి దర్శనాలు ఏర్పాటు చేశారు. బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో కర్పూర జ్యోతిని వెలిగించారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో మణికంఠుని ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి ఆలయ పరిసరాలలో తిరువీధి నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కర్పూరాలను భక్తులకు అందచేయగా, వాటిని ఆలయ ఆవరణలోని బానలో వేయగా.. పెద్దమంటలా ఏర్పడి మకరజ్యోతిని తలపించింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అయ్యప్పస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సువర్ణ మణిమయ మకుటాభరణాలతో స్వామి వారి దివ్యాలంకరణ వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి చిరంజీవులు, కార్యదర్శి దానేటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప శిఖర జ్యోతి దర్శనాలు..

పాతశ్రీకాకుళంలోని అయ్యప్పదేవాలయంలో కర్పూర జ్యోతి శిఖర దర్శనాలు, స్వామికి పడి పూజలు చేశారు. అర్చకులు బాలు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు పర్యవేక్షణలో 18 మెట్లపై కర్పూర జ్యోతులను వెలిగించారు. ఆలయ శిఖరంపైనా కర్పూర జ్యోతిని వెలిగించి భక్తులకు జ్యోతి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామాలతో పుష్పాభిషేకం నిర్వహించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన



లోకొండలో గిరిజనుల ప్రదర్శన

హిరమండలం: సంక్రాంతి అంటేనే సంప్రదాయాలు, సంస్కృతుల మేళవింపు. పండగ నాడు గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా లోకొండ గ్రామంలో 'మేమే గుర్రం' అంటూ ప్రదర్శించిన నృత్యం అబ్బురపరిచింది.

శ్రీముఖలింగంలో గోపూజ

జలుమూరు: గోసంరక్షణ చేయడమంటే 60 వేలమంది దేవతలను ప్రసన్నం చేసుకోవడమేనని శ్రీముఖలింగం ఆలయం అర్చకులు అభిప్రాయపడ్డారు. బుధవారం కనుమ సందర్భంగా శ్రీముఖలింగం ప్రధాన దేవాలయం పరిధిలోని రాధాగోవిందస్వామి, భీమేశ్వర, సోమేశ్వర ఆలయాల్లో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీదేవికి ప్రతీక గోవు అని, అందరూ గోవులను పూజించాలని కోరారు. దేవదాయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోపూజ నిర్వహించినట్లు ఈఓ ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణోత్సవం



గార: శ్రీకూర్మం క్షేత్రంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. తిరుప్పావైలోని 30 పాశురాలు ముగింపు రోజున సంప్రదాయం అనుసరించి మంగళవారం (సంక్రాంతి) ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి, సీతమ్మ, గోదాదేవి, చతుర్భుజ తాయారు (లక్ష్మీదేవి)లను ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు హారతిలిచ్చారు. అనంతరం గోదాదేవికి విరాటోత్సవం పేరిట విశేష అభిషేకాలు (తిరుమంజనసేవ) నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.గురునాథరావు, ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలు



రాజశేఖరం భార్య ఇందుమతి, కుమారుడు విక్రాంత్‌తో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్

- పాలకొండలోని నాగావళి నదీతీరంలో అంత్యక్రియలు
- అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, రాజకీయ ప్రముఖులు

పాలకొండ/వీరఘట్టం: రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖరం (81) అంతిమ వీడ్కోలు బుధవారం పాలకొండలో నిర్వహించారు. అశేషంగా తరలివచ్చిన అభిమానులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికార పార్టీ నాయకుల కన్నీటి నివాళుల నడుమ అంతిమ యాత్ర కొనసాగింది. అంపిలి గ్రామ సమీపంలోని నాగావళి నదీ తీరంలో అంతిమ సంస్కారాలను సంప్రదాయబద్ధంగా జరిపారు. ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తలకొరివి పెట్టగా, కుమార్తె రెడ్డి శాంతి, కుటుంబ సభ్యులు పార్థివదేహం చుట్టూ ప్రదక్షిణ చేసి అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, గొర్లె కిరణ్‌కుమార్, శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, డోల జగన్, గొండు కృష్ణమూర్తి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తదితరులు రాజశేఖరం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



హాజరైన చింతాడ రవికుమార్, నాయకులు



నివాళులు అర్పిస్తున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్



విక్రాంత్‌తో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్



మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్